క్లుప్తంగా

రైతు బజారు ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్/ వనస్థలిపురం రైతు బజార్లలో కూరగాయల ధరలు (కిలో... రూపాయల్లో) టమాటా 33, వంకాయ 35, బెండ 40, పచ్చిమిర్చి 45, కాకర 42, బీర 40, క్యాబేజీ 13, ఫ్రెంచిబీన్స్ 75–115, క్యారెట్ 37, దొండ 27–28, చిక్కుడు 65, గోకర 45, బీట్‌రూట్ 23, క్యాప్సికం 65, ఆలు 20, దోస 15, సొర 13, పొట్ల 23, ఉల్లి 14, చామగడ్డ 35. ఈ ధరలు మంగళవారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

రూ.70 లక్షలతో మార్కెట్‌లో డ్రైనేజీ పనులు

చైర్‌పర్సన్ అనితానాయక్

చాదర్‌ఘాట్: మలక్‌పేటలోని హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్‌లో నిత్యం డ్రైనేజీ సమస్యలతో ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో రూ.70 లక్షలతో మార్కెట్‌లో డ్రైనేజీ పైప్‌లైన్ పనులు ప్రారంభించినట్లు మార్కెట్ చైర్‌పర్సన్ అనితానాయక్ తెలిపారు. సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ, స్థానిక ఎమ్మెల్యే బలాల నిధుల నుంచి రూ. 50 లక్షలు, అదే విధంగా వ్యవసాయ మార్కెట్ నిధుల నుంచి రూ. 20 లక్షలతో డ్రైనేజీ పనులు ప్రారంభించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బలాలకు మార్కెట్ కమిటీ తరుపున కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. అదే విధంగా పనులు జరుగుతున్న నేపథ్యంలో రైతులు, వ్యాపారులు, దుకాణదారులు సహకరించాలని ఆమె కోరారు.

హనుమాన్ ఆలయ హుండీ లెక్కింపు


లెక్కింపులో పాల్గొన్న ఆలయ సిబ్బంది, భక్తులు

చంపాపేట: కర్మన్‌ఘాట్‌లోని శ్రీ ధ్యానాంజనేయ ఆలయ హుండీని సోమవారం లెక్కించారు. భక్తులు స్వామివారికి కానుకల రూపంలో రూ.37 లక్షల 86 వేల 640 నగదు, 56 యూఎస్‌ఏ, 50 సింగపూర్, 20 కెనడా డాలర్లు సమర్పించారని ఆలయ ఈఓ శ్రీనివాస శర్మ స్పష్టం చేశారు. లెక్కింపును జిల్లా ఎండోమెంట్ సహాయక కమిషనర్ మాణిక్ ప్రభు పర్యవేక్షించారు. ఆలయ మాజీ పాలక మండలి సభ్యులు, అర్చకులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

ఛత్రపతి శివాజీ అడుగు జాడల్లో నడవాలి


యువకులకు కామధేను చిత్రపటాలు పంపిణీ చేస్తున్న ప్రవీణ్‌గౌడ్

చైతన్యపురి: ఛత్రపతి శివాజీ అడుగు జాడల్లో నడుస్తూ హిందుత్వాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని సామాజిక కార్యకర్త లింగాల ప్రవీణ్‌గౌడ్ అన్నారు. శివాజీ మహారాజ్ పట్టాభిషేక దినోత్సవం సందర్భంగా ఆర్‌ఎస్‌ఎస్ వివేకానందనగర్ సంఘ్ చాలక్ ఆధ్వర్యంలో గడ్డిఅన్నారం డివిజన్ మధురాపురి కాలనీలోని స్వర్ణకార వీధిలో హిందూ సామ్రాజ్య దినోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా లింగాల ప్రవీణ్‌గౌడ్ మాట్లాడుతూ, సమాజానికి శివాజీ చేసిన సేవలను కొనియాడారు. యువకులకు కామధేను చిత్రపటాలను అందజేశారు. కార్యక్రమంలో ధర్మ జాగరణ్ మంచ్ ప్రముఖ్ బి.రాధాకృష్ణమూర్తి, స్వర్ణకార సంఘం మాజీ అధ్యక్షుడు అనంతాచారి తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం

చైతన్యపురి: పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ కోలేటి దామోదర్‌గుప్తా జన్మదినం సందర్భంగా దిల్‌సుఖ్‌నగర్ పీఅండ్‌టీ కాలనీలోని ఎస్‌ఎస్ బాంకెట్ హాల్‌లో రక్తదాన శిబిరం నిర్వహించారు. పద్మనవీన్ గుప్తా ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో 32 మంది యువకులు రక్తదానం చేశారు. అనంతరం కోదండరాంనగర్‌లో అన్నదానం చేశారు. కార్యక్రమంలో బురుగు లింగం, ఎడవెల్లి బాల్‌రాజ్, పాల్తి శ్రీనివాస్‌గుప్తా, వేణుగోపాల్ గుప్తా, రంగ శ్రీధర్, బచ్చు బాల్‌రత్నం పాల్గొన్నారు.

దానాలన్నింటిలో అన్నదానం మిన్న

చైతన్యపురి: అన్ని దానాల్లో అన్నదానం మిన్న అని తెలంగాణ టింబర్, సామిల్ ఫెడరేషన్ అధ్యక్షుడు, సాయి తులసి భవనం అధ్యక్షుడు చకిలం రమణయ్య అన్నారు. రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ కోలేటి దామోదర్ గుప్తా జన్మదినం సందర్భంగా టింబర్, సామిల్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో దిల్‌సుఖ్‌నగర్ రాజీవ్‌చౌక్‌లో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పూర నర్సింహగుప్తా, సింగికొండ నర్సింహ, జయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

రసాభాసగా 'విద్యుత్ ప్రగతి కార్యక్రమం'

- బీఆర్‌ఎస్ నాయకులను వేదికపైకి ఆహ్వానించడంపై ప్రశ్నించిన కాంగ్రెస్ కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి
- ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, కార్పొరేటర్ మధ్య వాగ్వాదం
- కార్పొరేటర్‌పై బీఆర్‌ఎస్ నాయకుల దాడి

తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం సరూర్‌నగర్ ఎంఈరెడ్డి గార్డెన్స్‌లో నిర్వహించిన విద్యుత్ ప్రగతి కార్యక్రమం 'ప్రొటోకాల్' లొల్లితో రసాభాసగా ముగిసింది. ప్రొటోకాల్ విషయమై లింగోజిగూడ కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి, ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి మధ్య జరిగిన వాగ్వాదం చివరకు రాజశేఖర్ రెడ్డిపై బీఆర్‌ఎస్ నాయకులు దాడి చేసే వరకు వెళ్లింది.– మన్సూరాబాద్

వివరాలు... సరూర్‌నగర్ ఎస్‌ఈ కరుణాకర్‌బాబు ఆధ్వర్యంలో విద్యుత్ ప్రగతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యేతో పాటు జీహెచ్‌ఎంసీ కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్‌లీడర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి హాజరయ్యారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ, సీఎం కేసీఆర్ అకుంఠిత దీక్ష, లోతైన ఆలోచన విధానాలతో ప్రతి ఇంటికీ నాణ్యమైన విద్యుత్‌ను దించగలుగుతున్నామన్నారు. రైతులకు 24 గంటలూ నాణ్యమైన ఉచిత విద్యుత్, నాయీ బ్రాహ్మణులకు, రజకుల ధోబీఘాట్లకు, లాండ్రీ షాపులకు ఉచితంగా విద్యుత్‌ను అందిస్తున్నామన్నారు. అనంతరం మా ట్లాడిన జీహెచ్‌ఎంసీ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ దర్పల్లి రాజశేఖర్ రెడ్డి సోనియా గాంధీ వల్లే తెలంగాణ రాష్ట్రం వచ్చిందని, ఉచిత విద్యుత్‌ను దివంగత నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వమని ఇచ్చిందని గుర్తుచేశారు. ప్రభుత్వ అధికారిక కార్యక్రమంలో బీఆర్‌ఎస్ డివిజన్ల అధ్యక్షులు, మాజీ అ ధ్యక్షులు, మాజీ కార్పొరేటర్లు వేదికపై ఉండటంతో బీఆర్‌ఎస్ కార్యక్రమంగా ఉందని వ్యాఖ్యానించారు.


విద్యుత్ ప్రగతి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

రాజశేఖర్‌రెడ్డిపై దాడి:

ప్రభుత్వ కార్యక్రమం బీఆర్‌ఎస్ పార్టీ కార్యక్రమంగా మారిందన్న దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి వాఖ్యలకు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి తన ప్రసంగంలో దీటుగా సమాధానం ఇచ్చారు. ప్రభుత్వ అధికార కార్యక్రమం కనుకనే నిన్ను ఆహ్వానించారనే విషయం తెలుసుకోవాలని రాజశేఖర్‌రెడ్డిని ఉద్దేశించి అన్నారు. దీంతో రాజశేఖర్‌రెడ్డి తనకు మైక్ ఇవ్వాలని కోరగా నిరాకరించడంతో ఇరువురి మధ్య వాగ్వాదం జరిగింది. అనంతరం దర్పల్లి వేదిక దిగి వెళ్తుండగా మరోమారు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి మధ్య వాగ్వాదం జరిగింది. ఈ సమయంలో బీఆర్‌ఎస్ కార్యకర్తలురాజశేఖర్‌రెడ్డిపై దాడి చేశారు. పోలీసులు జోక్యం చేసుకుని ఇరువర్గాలను సముదాయించారు. దర్పల్లి అనుచరుడు ప్రవీణ్‌రెడ్డి ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేయడంతో అతడిపై కూడా సుధీర్‌రెడ్డి అనుచరులు దాడి చేశారు.

కాగా, సమావేశంలో విద్యుత్ డీఈలు రామకృష్ణ,


వనస్థలిపురం పీఎస్ ఎదుట ఆందోళన చేస్తున్న రాజశేఖర్‌రెడ్డి, మల్‌రెడ్డి రాంరెడ్డి, జక్కిడి ప్రభాకర్‌రెడ్డి


సమావేశంలో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, కార్పొరేటర్ రాజశేఖర్‌రెడ్డిల మధ్య వాగ్వాదం

రాంమ్మోహన్, సంధ్యారాణి, రమణారెడ్డి, హయత్‌నగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ మారుతిదివాకర్, మాజీ కార్పొరేటర్లు కొప్పుల విఠల్‌రెడ్డి, జిట్టా రాజశేఖర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ డివిజన్ల అధ్యక్షుడు జక్కిడి మల్లారెడ్డి, కటికరెడ్డి అరవింద్‌రెడ్డి, తూర్పాటి చిరంజీవి, చింతల రవికుమార్, తోట మహేష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్ వద్ద కాంగ్రెస్ నాయకుల ధర్నా..

హస్తినాపురం: ప్రభుత్వ అధికారిక కార్యక్రమంలో ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అనుచరులు కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డిపై దాడి చేయటాన్ని నిరసిస్తూ వనస్థలిపురం ఠాణా ఎదుట కాంగ్రెస్ నేతలు ఆందోళన నిర్వహించారు. బీఆర్‌ఎస్ కార్యకర్తలను రెచ్చగొట్టి రాజశేఖర్‌రెడ్డిపై దాడి చేయించిన ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిని అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు భీమిడి రామకృష్ణారెడ్డి, సదాశివుడు, పన్యాల జైపాల్‌రెడ్డి, ఎర్రంబెల్లి సతీష్‌రెడ్డి, పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

కేసు నమోదు: దర్పల్లి రాజశేఖర్‌రెడ్డిపై దాడి చేసిన మహేష్‌కుమార్ యాదవ్, అరుణ్‌కుమార్, నవీద్ ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు వనస్థలిపురం ఇన్‌స్పెక్టర్ జలంధర్‌రెడ్డి తెలిపారు.

ఓటమి భయంతోనే భౌతిక దాడులు

వచ్చే ఎన్నికల్లో ఓడిపోతామనే భయంతోనే బీఆర్‌ఎస్ నాయకులు భౌతిక దాడులకు పాల్పడుతున్నారని టీపీసీసీ వ ర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్‌కుమార్‌గౌడ్, సీనియర్ ఉ పాధ్యక్షుడు మల్లు రవిలు ప్రకటనలో పేర్కొన్నారు.

క్రిస్టియన్ల అభివృద్ధికి ప్రభుత్వం కృషి


మంత్రి సబితారెడ్డికి సన్మానం చేస్తున్న పాస్టర్స్, క్రిస్టియన్ సంఘాల ప్రతినిధులు

దిల్‌సుఖ్‌నగర్: క్రిస్టియన్ మైనారిటీల సర్వతోముఖాభివృద్ధికి ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలోని తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తోందని విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి అన్నారు. ఆర్‌కేపురం డివిజన్ పాస్టర్స్ అసోసియేషన్, క్రిస్టియన్ యూత్ అసోసియేషన్ల ఆధ్వర్యంలో క్రైస్తవ సంఘాల ఐక్య సభ ఆదివారం రాత్రి హరిపురి కాలనీలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి సబితారెడ్డి మాట్లాడుతూ, శాంతి, కరుణ, ప్రేమ, సేవ అన్న జీసస్ బోధనలు ఎంతో గొప్పవన్నారు. ఇవి ప్రపంచ దేశాల మధ్య యుద్ధాల నివారణకు దోహదం చేస్తాయన్నారు. మహేశ్వరంలో సమాధుల తోటకు స్థలం కేటాయించినట్లు ఇక్కడ కూడా ఇప్పించేందుకు కృషి చేస్తానన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ అన్ని మతాలను సమానంగా చూస్తూ అన్ని పండుగలు అధికారికంగా నిర్వహిస్తున్నారు. క్రిస్టియన్ మైనారిటీల ఆత్మగౌరవం పెంపొందించేలా 2 ఎకరాల స్థలంలో 10 కోట్ల రూపాయలతో క్రిస్టియన్ భవనం నిర్మిస్తున్నారని తెలిపారు. దరఖాస్తు చేసుకున్న ప్రతి పేద క్రిస్టియన్ కుటుంబానికి డబుల్ బెడ్ రూమ్ ఇల్లు అందించడంతోపాటు ఆరోగ్య సమస్యలు ఉంటే సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి ఆర్థిక సాయం అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఆయాచితం శ్రీధర్, బీఆర్ ఎస్ పార్టీ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి అరవింద్ శర్మ, ఆర్‌కేపురం డివిజన్ అధ్యక్షుడు నాగేష్, సీనియర్ నాయకులు సాజిద్, శ్రీనివాస్, పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జాన్, ఇమ్మ్యునేజర్, జయరాజ్ ప్రవీణ్‌కుమార్, రమేష్‌కుమార్, వినోద్, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు అందరూ కృషి చేయాలి


హరిత ర్యాలీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

లింగోజిగూడ: పర్యావరణ పరిరక్షణకు అందరూ కృషి చేయాలని, పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం కాలుష్య నియంత్రణ మండలి, జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో ఎల్‌బీనగర్ మాల్ మైసమ్మ ఆలయం నుంచి ప్రజయ్ టవర్స్ వరకు సర్వీస్ రోడ్డులో హరిత ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ర్యాలీని ప్రారంభించి మాట్లాడుతూ, కాలనీల్లో రోడ్లపై మురుగు ప్రవహించకుండా చూసుకోవడం మన బాధ్యత అని అన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి తమ వంతుగా పర్యావరణ పరిరక్షణలో భాగం కావాలని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరిలో చిన్నపాటి మార్పు, కృషి కారణంగా పర్యావరణానికి ఎంతో మేలు జరుగుతుందన్నారు. డీసీలు మారుతీదివాకర్, కృష్ణయ్య, కాలుష్య నియంత్రణ మండలి అధికారులు వెంకట నర్సు, రాజేశ్వర్‌రెడ్డి, యాదయ్య, శరత్, చంద్ర, మహేష్ పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గిస్తే కాలుష్యానికి చెక్

రంగారెడ్డి కోర్టులు: మనిషి అవసరాల రీత్యా ప్రకృతి వనరులను అపరిమితంగా వాడేస్తున్నాడని, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గిస్తే కాలుష్యాన్ని కొంతవరకు అదుపులో ఉంచవచ్చని జిల్లా ప్రధాన న్యాయమూర్తి హరేకృష్ణ భూపతి అభిప్రాయపడ్డారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఇందిర అధ్యక్షతన రంగారెడ్డిజిల్లా కోర్టులో సోమవారం జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. అనంతరం ప్రధాన న్యాయమూర్తి ఇతర న్యాయమూర్తులతో కలిసి కోర్టు ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో మెట్రోపాలిటన్ సెషన్స్ న్యాయమూర్తి పట్టాభి రామారావు, న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు డీకొండ రవీందర్, కార్యదర్శి మాధవరెడ్డి, న్యాయవాదులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.


కోర్టు ఆవరణలో మొక్కలు నాటుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి హరేకృష్ణ భూపతి

న్యాయమూర్తులకు ఘనస్వాగతం


సమావేశంలో ప్రసంగిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి హరేకృష్ణ భూపతి

రంగారెడ్డి కోర్టులు: జిల్లాకోర్టుకు ఇటీవల బదిలీపై వచ్చిన న్యాయమూర్తుల పరిచయ కార్యక్రమాన్ని న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. వారికి ఘన స్వాగతం పలికి శాలువాలతో సత్కరించారు. న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు డీకొండ రవీందర్, కార్యదర్శి పటోళ్ల మాధవ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి హరేకృష్ణ భూపతి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ, న్యాయవాదులు, న్యాయమూర్తులు సమాజానికి అందిస్తున్న సేవలను కొనియాడారు. ఇటీవల బదిలీపై జిల్లా కోర్టుకు వచ్చిన న్యాయమూర్తుల వివరాలను తెలియజేశారు. మెట్రోపాలిటన్ సెషన్స్ కోర్టు న్యాయమూర్తిగా పట్టాభి రామారావు, ప్రధాన సీనియర్ సివిల్ న్యాయమూర్తిగా పి.ఆంజనేయులు, రెండవ అదనపు సీనియర్ సివిల్ న్యాయమూర్తిగా ఎ.రాధిక, న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శిగా డి.ఇందిర, ఐదవ అదనపు మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్‌గా ఎస్. మంజుల, నాల్గవ అదనపు మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ – మల్కాజిగిరిగా కె.సౌజన్య వచ్చారని వారిని పరిచయం చేశారు. న్యాయవాదుల పరస్పర సహకార సంఘం సంచాలకుడు డా.బాచిరెడ్డి శాయి రెడ్డి, కార్యవర్గ సభ్యులు, న్యాయమూర్తులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

'జాగృతి' యువజన అధ్యక్షుడికి ఎమ్మెల్సీ కవిత పరామర్శ


మోహన్‌రావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కవిత

చంపాపేట: బీఎన్‌రెడ్డి డివిజన్ ఎన్‌జీఓస్ కాలనీకి చెందిన జిల్లా భారత జాగృతి యువజన విభాగ అధ్యక్షుడు సందీప్‌కుమార్ తండ్రి బొల్లంపల్లి మోహన్‌రావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న రాష్ట్ర భారత జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సోమవారం సందీప్‌కుమార్ నివాసానికి వచ్చి మోహన్‌రావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులను ఓదార్చారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు ముద్దగౌని రామ్మోహన్‌గౌడ్, రాజీవ్ సాగర్, బాబా ఫసియుద్దీన్, సామ రమణారెడ్డి, సుజాతానాయక్, ముద్దగౌని లక్ష్మీప్రసన్న రామ్మోహన్‌గౌడ్, రాజశేఖర్‌రెడ్డి, విఠల్‌రెడ్డి, వెంకటేష్‌గౌడ్, కోఠి నర్సిరెడ్డి పాల్గొన్నారు.

మహిళా మోర్చాను మరింత బలోపేతం చేయాలి

నాగోలు: భారతీయ జనతా పార్టీ మహిళా మోర్చాను మరింత బలోపేతం చేయాలని ఆ పార్టీ మహిళా మోర్చా రంగారెడ్డి జిల్లా అర్బన్ అధ్యక్షురాలు నాగినేని కృష్ణవేణి పిలుపునిచ్చారు. సోమవారం నాగోలు డివిజన్‌లో బీజేపీ మహిళా మోర్చా సమావేశం కార్పొరేటర్ చింతల అరుణ సురేంద్రనాథ్ యాదవ్ సమక్షంలో నిర్వహించారు. వారు మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు మహిళా మోర్చాలో చేరారు. కార్యక్రమంలో బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర కార్యదర్శి శ్యామల, రంగారెడ్డి జిల్లా అర్బన్ కార్యదర్శి మన్నెం అరుణ, కాలంశెట్టి లయ, సరస్వతి, డివిజన్ వర్కింగ్ ప్రెసిడెంట్ బద్దం బాలకృష్ణగౌడ్ పాల్గొన్నారు.


కృష్ణవేణి, అరుణ సమక్షంలో బీజేపీ మహిళా మోర్చాలో చేరిన మహిళలు

'నోటీసులు ఇవ్వకుండా పేదల ఇళ్లు కూల్చడం దుర్మార్గం'


సరూర్‌నగర్ తహసీల్దార్‌తో మాట్లాడుతున్న కొత్తపేట కార్పొరేటర్ పవన్‌కుమార్

నాగోలు: కొత్తపేట డివిజన్ భరత్ నగర్ ఫేస్-1లోని పేదల ఇళ్లను ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా కూల్చడం దుర్మార్గమని కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ అన్నారు. భరత్‌నగర్ ఫేజ్-1లో 59 జీఓ కింద 60 గజాల స్థలాలకు దరఖాస్తు చేసుకున్న ఒక్కొకరికి రూ.7 లక్షల చొప్పున డబ్బులు కట్టాలని అధికారులు నోటీసులు ఇచ్చారు. పేదలు అంత డబ్బులు కట్టలేమని విన్నవించుకున్నారు. వారి విజ్ఞప్తిని పట్టించుకోకుండా సరూర్‌నగర్ తహసీల్దార్.. పోలీసు అధికారులతో కలిసి సోమవారం జేసీబీ సాయంతో ఇళ్లు కూల్చడానికి వచ్చారు. ఈ సమాచారం అందుకున్న కార్పొరేటర్ నాయికోటి పవన్ కుమార్ అక్కడి వచ్చి కూల్చివేతలను అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, డబ్బులు కట్టలేదని, ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా పేదల ఇళ్ల ధ్వంసం చేయడం ఏమిటని ప్రశ్నించారు. పేదలకు డబ్బు కట్టడానికి సమయం ఇవ్వాలని కోరడంతో అక్కడినుంచి అధికారులు వెనుతిరిగారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు కొర్లపల్లి స్వామి, వెంకటేష్ గౌడ్ పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

మహేశ్వరం: పర్యావరణ పరిరక్షణకు మొక్కలను నాటాల్సిన అవసరం ఉందని జల్‌పల్లి మున్సిపల్ కమిషనర్ ఎస్.వసంత అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా జల్‌పల్లి పెద్ద చెరువు సమీపంలో బయో మైనింగ్ కొనసాగుతున్న ప్రాంతంలో సోమవారం ఆమె క్యూబ్ బయో ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్ వారి ఆధ్వర్యంలో మొక్కలను నాటారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ... పర్యావరణ కాలుష్యానికి, ప్రకృతి విధ్వంసానికి, మూగ జీవాల మరణానికి కారణమవుతున్న ప్లాస్టిక్ వినియోగాన్ని వదిలేయాలన్నారు. మున్సిపాలిటీ పరిధిలో తక్కువ మందం కలిగిన ప్లాస్టిక్ కవర్లు వాడకుండా ప్రత్యేక డ్రైవ్ చేపడుతున్నామన్నారు.

ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాల కూల్చివేత


జేసీబీతో నిర్మాణాల కూల్చివేత

సాక్షి ఎఫెక్ట్..

హయత్‌నగర్: మండలంలోని సాహెబ్‌నగర్‌లో సర్వే నంబర్ 71/1లోని ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలను రెవెన్యూ అధికారులు కూల్చివేశారు. సర్కార్ భూమిని రక్షించాల్సిన రెవెన్యూ అధికారులు బినామీ పేర్లతో కాజేసేందుకు ప్రయత్నిస్తున్నారంటూ 'ప్రభుత్వ భూమికి ఎసరు' శీర్షికన ఈనెల 3న 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. సోమవారం రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ నర్సింహ యాదవ్ ఆధ్వర్యంలో జేసీబీ సాయంతో సిబ్బంది 11 ఇంటి నిర్మాణాలు, 5 ప్రహరీలను కూల్చివేశారు. వీఆర్‌ఏలు ఆంజనేయులు, రంజిత్ పాల్గొన్నారు.

భార్యతో మనస్పర్థలు.. వ్యక్తి ఆత్మహత్య

నాగోలు: భార్యతో మనస్పర్థలు ఏర్పడటంతో మనస్తాపం చెంది ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన ఎల్‌బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగోలు జైపురికాలనీ చెందిన బత్తుల సైదులు(36) వాటర్ ప్రూఫ్ వర్క్ చేస్తున్నాడు. ఇతనికి భార్య శ్రీలతతో కొత్త కాలంగా మనస్పర్థలు రావడంతో విడివిడిగా ఉంటున్నారు. సోమవారం సైదులు పనికి రాకపోవడంతో సహోద్యోగి రాములు అతని ఇంటి వెళ్లి చూడగా లోపల నుంచి తాళం వేసి ఉంది. అనుమానంతో రాములు ఇంటి కిటికీ అద్దాలు పగులగొట్టి చూడగా సైదులు టవల్‌తో ఇనుప రాడ్‌కు ఉరేసుకొని మృతి చెందినట్లు గుర్తించాడు. అతని సోదరుడు నాగేష్‌కు సమాచారం ఇవ్వగా అతను వచ్చి ఎల్‌బీనగర్ పోలీసులకు సమాచారం ఇచ్చాడు. సైదులుకు కొంతకాలంగా తన భార్యతో మనస్పర్థలు ఉన్నాయని, ఈ నేపథ్యంలోనే మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని ఎల్‌బీనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్ట్‌మార్టం కోసం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు.

రేషన్ డీలర్లకు గౌరవ వేతనం అమలు చేయాలి


నాగోలులో నిరసన వ్యక్తం చేస్తున్న కొత్తపేట రేషన్స్ డీలర్స్

నాగోలు: రేషన్ డీలర్లకు వెంటనే గౌరవ వేతనం అమలు చేయాలని కొత్తపేట రేషన్స్ డీలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జ్ఞానేశ్వర్, కార్యదర్శి శేఖర్‌గౌడ్ డిమాండ్ చేశారు. రాష్ట్ర రేషన్ డీలర్స్ జేఏసీ పిలుపు మేరకు కొత్తపేట రేషన్ డీలర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం రేషన్ షాప్స్ బంద్ చేసి నాగోలులో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, డీలర్స్‌కు కనీస గౌరవ వేతనం ఇవ్వాలన్న డిమాండ్ నెరవేరే వరకు రాష్ట్ర వ్యాప్తంగా రేషన్ షాపులు బంద్ చేస్తామని వారు స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత కూడా 9 ఏళ్లుగా డీలర్లు షాపుల కిరాయి కూడా కట్టలేక, వర్కర్స్ జీతం, హమాలీకి డబ్బులు చెల్లించలేక అనేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి కేసీఆర్ రేషన్ డీలర్స్‌పై కనికరం చూపి డీలర్స్‌కు కనీస గౌరవ వేతనం చెల్లించి ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో కొత్తపేట డీలర్స్ అసోసియేషన్ సభ్యులు రమేష్, శ్వేత, ఆశన్న, మోహన్ రాజ్, జై కుమార్, శ్రీధర్ రావ్, శివ చక్రవర్తి, సాయి రెడ్డి, వెంకట రెడ్డి, వేణు గోపాల్, మహేందర్, వట్టేపు యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు చీరల పంపిణీ


చీరలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ దయానంద్ గుప్తా, ఉమామేశ్వరరావు తదితరులు


విద్యార్థులకు నోట్ బుక్స్ అందజేస్తున్న ఉప్పల రాజ్యలక్ష్మి

నాగోలు: తెలంగాణ పోలీస్ హౌసింగ్ బోర్డు కార్పొరేషన్ చైర్మన్ కోలేటి దామోదర్ గుప్తా జన్మదినం సందర్భంగా కొత్తపేట డివిజన్ న్యూమారుతినగర్‌లో శ్రీవాసవి ఫ్యామిలీ వెల్ఫేర్ సొసైటీ వ్యవస్థాపకులు కోట ఉమామేశ్వరరావు-కోట శ్రీదేవి ఆధ్వర్యంలో సోమవారం జీహెచ్‌ఎంసీ పారిశుద్ధ్య కార్మికులకు, పేద మహిళలకు ఉచితంగా చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్ హాజరై చీరలు అందజేశారు. ఆర్యవైశ్య సంఘం నాయకులు గౌరిశెట్టి ప్రభాకర్, కాలనీ వాసులు అంజయ్య, వెంకటేష్, సోమారపు యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం

లింగోజిగూడ: రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ కోలేటి దామోదర్ గుప్తా పుట్టిన రోజు సందర్భంగా ట్విన్ సిటీస్ ఆర్యవైశ్య మ్యారేజ్ బ్యూరో, బండారు సుబ్బారావుల ఆధ్వర్యంలో ఎల్‌బీనగర్ మెట్రో స్టేషన్ సమీపంలో సోమవారం అన్నదానం చేశారు. ఆర్యవైశ్య ట్విన్ సిటీస్ మ్యారేజ్ బ్యూరో అధ్యక్షుడు గౌరిశెట్టి ప్రభాకర్, కార్యదర్శి వెంకటేశ్వర్లు, కోశాధికారి తోనుకునూరి రజినీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వాసవి మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో..

దిల్‌సుఖ్‌నగర్: ఇంటర్నేషనల్ వాసవి మహిళా సమాఖ్య 104వ కార్యవర్గ సమావేశం సోమవారం ఆర్‌కేపురం డివిజన్ వాసవి కాలనీలోని వాసవి ఆధ్యాత్మిక కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ హౌసింగ్ బోర్డ్ కార్పొరేషన్ చైర్మన్ కోలేటి దామోదర్ గుప్తా జన్మదిన సందర్భంగా ఇంటర్నేషనల్ వాసవి మహిళా సమాఖ్య అధ్యక్షురాలు ఉప్పల రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం, ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు స్కూల్ బుక్స్, నోట్‌బుక్స్, స్కూల్ ఫీజుతో పాటు, పారిశుద్ధ్య కార్మికులకు చీరలు పంపిణీ చేశారు. బొగ్గారపు వరుణ్ చంద్ర, సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

పేదల ఇళ్లను కూల్చొద్దు

హుడాకాంప్లెక్స్: బడుగు, బలహీన వర్గ పేద ప్రజల ఇళ్లను కూల్చడం దారుణమని సరూర్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి అన్నారు. జీవో నెం-59 ప్రకారం ఇళ్లను రెగ్యులరైజ్ చేసుకున్న పేదలు డబ్బులు చెల్లించడం లేదంటూ సోమవారం సరూర్‌నగర్ తహసీల్దార్ జయశ్రీ ఆధ్వర్యంలో భగత్‌సింగ్‌నగర్‌లోని కూల్చివేతలకు సిద్ధమయ్యారు. విషయం తెలుసుకున్న స్థానిక కార్పొరేటర్, బీజేపీ కార్యకర్తలు అక్కడికి చేరుకుని తహసీల్దార్‌ను అడ్డుకున్నారు. కార్పొరేటర్ మాట్లాడుతూ.. పేదల ఇళ్లను కూల్చొద్దని.. కూల్చివేతలకు తీసుకువచ్చిన జేసీబీను తనపై నుంచి తీసుకువెళ్లాలని తహసీల్దార్ వాహనం ఎదుట బైఠాయించారు. రెగ్యులరైజేషన్ చార్జెస్ కట్టేందుకు సమయం పొడిగించాలని విజ్ఞప్తి చేశారు.